
# అయ్యిందమ్మో పెండ్లి

గుండం రామచంద్రారెడ్డి



"అయినా లచ్చిందేవీ.. ఈనికి ఎంతజెప్పినా సిగ్గురాదుమ్మే. భుజాల కాడికి జుట్టు పెంచినాడు గానీ, బుద్ధి మాత్రం పెరగలేదు నాబట్టకొడుక్కి" అంటూ వెల్దింగు శివయ్య కొడుకు నారాయణగాని మీద వీరకోపంతో చెబుతాంది సావిత్రి.

వెల్దింగు నారాయణ కొడు కంటే పెద్ద ఫేమసు. బాతురూముల మీద బండల్లేకపోయినా.. నెర్రెలు కనపన్నా సందుల్లో ఒంటికన్నుతో బలే చూస్తాడు.. ఆడోల్లు

# నీళ్లుపోసుకుండేటప్పుడు.

ఓయమ్మా అదే అయితే రాత్తిర్లన్నా పోసుకుండేటోల్లు. నల్లగీతల చొక్కా ఇస్త్రీ చేయించుకుని వీధిలో కోంటోల్ల పుల్లన్న కొట్టుకాడ కూచ్చున్నాడంటే వద్దంటే లేవడు.. వీధిలో ఆడోళ్లను ఒకటేమైన ఏదో ఒకటి అంటానే వుంటాడు. యీనికి తోడు సుధాకరు, బాయికాడ కిట్టిగాడు దోస్తానా. ముగ్గురూ జతకూన్నారంటే కాలోజీకి పోయేవాళ్లు కూడా రోంచేపు ఇంట్లో కూచ్చోని పాదాం అనుకుంటాంటారు.

పజ్జెనిమిదేండ్లొచ్చిన పన్జెయ్యమంటే ఎప్పుడూ మూలగడే. దుప్పటెగదన్ని పండుకున్నాడంటే పొద్దెక్కి జాము గడిచినా వళ్ళిరుసుకోడమేగాని లేచి పంజేచ్చామని సింత లేదు.

ఒకరోజు జెండామాను పీరయ్య పెళ్ళాము వుశానమ్మ ఉరుసుకు పోవాలని పొద్దన్నుంచీ ఇండ్లు కడిగి బట్టలుతుక్కోని నీళ్లుబోసుకుందామని జాలాట్లోకి పోయింది. ఎవరెప్పుడు నీళ్ళు పోసుకునేది నారిగాడికి అన్నీ తెలుసు. వుశానమ్మ నీళ్లుబోసుకుందామని గుడ్డలిప్పి ఒక్క చెంబు నీళ్ళు బోసుకుని నెత్తి పైకెత్తి వెంటికలు వెనక్కు అందామని కప్పులేని జాలాట్లో ఆకాశం దిక్కు చూసింది.

అంతే నారిగాడు ఓబులేసు మిద్దెమీదనుంచి తొంగి తొంగి చూస్తాన్నాడు. వుశానమ్మ సావుకేక వేసి కోక వీపుకు కప్పుకుని బైటికొచ్చింది. వడ్డెవాళ్ల రామయ్య కేక వినంగానే జెండామాను పీరయ్య ఇంటికి గసపెడ్తా పరిగెత్తి ''ఏం వుశానవ్మా ఏమైంది'' అని అడిగేసరికే...

''వెల్డింగు శివయ్య కొడుకు నారిగాడు నన్నంతా జూసినాడు నాయనా. నాబట్టకొడుకు ఉరుసుకు పోయింటాడని పగులే జాలాట్లేకి పోయినా. లేకుంటే పోను'' అని ఏడ్చింది.

వాళ్లు యీళ్ళు గుమికూడి రాముల్దేలం కాడ ఏమీ తెలియనట్టు గోలీకాయలాటజూస్తున్న నారిగాడ్ని పట్టుకుని చితకదన్నినారు. విఏఓ వెంకట సుబ్బాడ్డయితే ''నాకొడక ఇసారి ఇట్టాటి పనిజేస్తే నిన్ను ఊరెల్లగొడతా. బద్రంగా వుండు'' అంటూ భయం జెప్పి వదిలేసినాడు.

వుశానమ్మ మాత్రం సాయంత్రం వెల్డింగు శివయ్య ఇంటికొచ్చేదాకా కాసుక్కూచ్చోని.. సాయంత్రం శివయ్యను కడమ్మాను పట్టెకాన్నే అడ్డగిచ్చింది. ''ఏం శివయ్యా! నేను నీల్లుబొసుకుంటాంటే నీ కొడుకును చూడమని జెప్పినావా? ఓబులేసు మిద్దెక్కి జాలాట్లోకి తొంగి జూసినాడు నీకొడుకు. నీ కొడుక్కున్నంత కొవ్వు వూల్లో ఏ నాబట్టకొడుక్కూ లేదు. వానికి కొవ్వు అనగాలంటే యాన్నన్న పిల్లను జూసి పెల్లిజెయ్యి. అప్పుడనుగుతాది వానికి రంది'' అంటూ నారిగానిమీద కోపమంతా శివయ్యమీద జూపాలకే.. శివయ్య పాణం పైలోకాల్లోనే పోయింది.

'నా కొడుకు ఒక్కడు పుట్నా అల్లర్నాకొడుకు పుట్టిసచ్చినాడు. ఈనాకొడుక్కు పిల్లను జూసి పెళ్లి చెయ్యాలన్నా ఎవరిస్తారు. ఇంత అబాపురినాకొడుక్కు' అంటూ మనసులోనే గొణుక్కుని ఇంట్లోకి బొయినాడు.

ఉరుసుకు బొయి రేత్రి తొమ్మిదికి పైనే వచ్చినాడు నారాయణ ఒక నల్లకల్లద్దాలు తీసుకొని. సున్నంబూసిన కుండకు మసిబొట్టున్నట్టుండాది వానిమొగానికి నల్లద్దాలు బెట్టింటే. వుశానమ్మ ఇంటికొచ్చి అల్లరచేసింది తెల్దు పాపం బిడ్డకు.

''ఒరే నారాయణా! రేపుట్నుంచి వెల్డింగు పనికి రాకపోతే నాకొడకా నాఇంట్లోనే వద్దు నువ్వు. మర్యాదగా బాషా షాపులో పనికిపెడ్తా రేపు నిద్దర మంచం లేస్తానే నాతో రా'' అంటూ ఎంత తిట్టినా నోరు మెదపలా బిడ్డ.

బాషా షాపులో పని కుదిరింది. నలుపు మొకానికి వెల్డింగు పని అచ్చిరాలే. అందుకే మసిగొట్టినట్టు తేలినాడు. ఇంటికొచ్చి లైఫ్‌బాయ్ సబ్బుతో రుద్దుడే రుద్దుడు. నారిగాడికి సోకులెక్కువ. వెల్డింగు పని రాత్రి ఎనిమిద్దాకా వున్నే.. కొవ్వు గరగలే. కోంటోల్ల పుల్లన్న కొట్టుదగ్గరికి పోడం మానుకోలే. పుల్లన్న భయస్తుడు పాపం. వద్దంటే ఏమంటాడోనని ఏమీ అన్లేడు.

వున్నెట్టుండి ఒకరోజు శివయ్య... ''నారాయణా! ఈరోజు పనికొద్దులే. నీకు పెల్లి పెత్తనం వచ్చాండారు. యాడికీ పోకుండా ఇంటిపట్టునే వుండి.. ఆ మంగలషాపుకు పోయి రోంత నెత్తి గత్తిరించుకో. జులపాలు ఆ వంతున పెంచుకొని సుగాలోల్ల మాదిరుండావు'' అన్నాడు.

మంగలోల్ల దగ్గిర నెత్తి సుబ్బరంగా గత్తిరిచ్చుకోని సినిమా హీరో లెక్క తయారయినాడు నారాయణ. కవనగాండ్ల పల్లె నుంచి సంబంధమొచ్చింది. వాళ్ళూ బీదోల్లే పాపం. ఎట్టో కట్ట ఆడబిడ్డను సాగనంపాలని శివయ్య ఇంటికొచ్చినారు. ఇల్లు వాకిలి జూసినారు. పిల్లోడు నచ్చినాడు.

''ఏ శివయ్యమామా! ఏ మాత్రంలో వుండావో చెప్పు'' పిల్ల నాయిన జయన్న అడిగినాడు.

''ఏముంది మామా! నీకు తెలియందేముంది? యాభైవేలిచ్చి తాలి బొట్టు సరుడు చెయ్యించు'' అన్నాడు శివయ్య.

మాటా మాటా కల్సి ఒకపదివేలు తగ్గినాడు శివయ్య. వచ్చే బేస్తారం వక్కాకు బెట్టనొచ్చాండమని అయ్య దగ్గెర మూర్తమడిగినారు.

నారిగాడి సోకులు అలివిగాడంలే. గోదమ రంగు పాయింటు మీదికి తెల్లటి చొక్కా గుట్టిచ్చుకోని చేతిగుడ్డ ప్యాంటు జోపీలో పైకి కనపడేట్టు తయారయ్యి బోతాంటే ఊళ్లో అమ్మలక్కలంతా ''ఈ నాబట్టకు పిల్లనిచ్చేవోడు ఎర్రినాకొడుకే'' అని మనసులోనే అనుకుంటాంద్రు.

తాసితాంబూలం బెట్టుకోని మూర్తం ఖరారు చేసుకొని వచ్చినాడు శివయ్య.

సరిగ్గా నెల్రోజులే పెళ్లి.

నారాయణకు మాత్రం శివయ్య చిలక్కు జెప్పినట్టు చెబుతానే వుండాడు ''నాయనా పెల్లి కుదిరింది. నువ్వు ఎట్టాంటి అల్లరపని చెయ్యకూడదని''

వెల్డింగు పనికి ఒకరోజు బోతే ఒకరోజు బోడంలే. నల్లంగ అయితాండనని నారిగాడికి అనుమానం. పెల్లి వారముందనగానే వెల్డింగు పని మానేసి ఇంట్లో తినడం కోంటోల్ల పుల్లన్న కొట్టుకాడ కూచ్చోవడం.

ఇంటికాడ రాముల్దేలంలోనే పెల్లి అయింది. ఆడమ్మగారంతా అల్లరోని పెళ్లాం ఎట్టుందో సూసేదానికి బాగానే వచ్చినారు. నారిగాడి అదుట్టమే మోగాని పెల్లాం బాగానే వుంది.


నారిగాడి ఆనందానికి మాత్రం పట్టపగ్గాల్లేవు. ముసి ముసి నవ్వులు. మూడో నిద్దరకు అత్తగారింటికి బొయినారు. మూర్తం బాగుందని ఆరోజే


**పూర్తిగా ఆశ్చర్యకరంగా అనుకున్నది నెరవేర్చే అద్భుత సిద్ధ ఉంగరం ఉచితం**



**మీరు** అనుకోకుండా ఏవైనా ఇబ్బందులలో చిక్కుకున్నా బాధపడవలసిన అవసరం లేదు. వెంటనే మా ఆశ్రమ ఉంగరం పొంది ధరించుట లేదా మీ వద్ద ఉంచుకొనుట ద్వారా ఇది మీరు కోరుకున్న పురుషుడు లేదా స్త్రీ మనసుని మీ వైపు ఆకర్షిస్తుంది. మీరు ఎవరి పేరు ఉచ్చరిస్తారో వారు ఎంతటి కఠిన హృదయం కలిగినవారైనా మీ పాదాల చెంత దాసోహం అంటారు. ఇంకా మీ ఇష్ట ప్రకారం వ్యవహరిస్తూ నడుచుకుంటారు. వ్యాపారంలో లాభం, పరీక్షలలో విజయం, మనసుకు నచ్చిన వివాహం, పుత్రభాగ్యం, లాటరీలో బహుమతులు, ఇంట్లో గొడవలు, అనారోగ్యాలు, అప్పుల సమస్యలు మొదలైన ఇబ్బందుల నుండి విముక్తి, ఆరోగ్యం విషయంలో అనుకూలత, జ్ఞాపకశక్తి అభివృద్ధి, ఉద్యోగంలో ఉన్నత పదవులు, వ్యాజ్యాలలో విజయం, పోగొట్టుకున్న వస్తువులు దొరకుట, ఇంట్లో సుఖ సంతోషాలు, ఇలా మీరు దినదిన ప్రవర్ధమానంగా పురోభివృద్ధి చెందుతూ, అన్ని పనులలో విజయం సాధించేలా చేసి ఈ అద్భుత సిద్ధ ఉంగరం ఇప్పుడు మా ఆశ్రమ విశేషయజ్ఞం సందర్భంగా కొద్ది రోజులు వరకు ఉచితంగా పంపించబడుతున్నది. దీనిని కావాలనుకొనేవారు తమ పేరు, చిరునామా మరియు ఒకటి నుండి తొమ్మిది లోపల ఒక అంకెను మరవకుండా మాకు తెలియజేయ వలసిందిగా కోరుతున్నాం. మీరు సంప్రదించ వలసిన చిరునామా:

**MANOJ PATHAK (Tantrik) (P)**
**Rany Bag Colony, Kamalapur-261302 (Sitapur) (U.P.)** TEL



## ఇక అంతా హ్యాపీస్

కత్రీనా కైఫ్ ఏక్షణాన ఇండియా వచ్చిందోగానీ వచ్చింది లగాయితూ సల్మాన్‌ఖాన్ గర్ల్‌ఫ్రెండ్‌గానే అందరి గుర్తింపూ పొందుతోంది. ఆ పిల్ల ఏనాడూ తమ అనుబంధం గురించి చెప్పుకోలేదు. గుంభనగానే వుంటోంది. కానీ సినిమా జనం మాత్రం బొత్తిగా ఏ మసాలా లేకపోతే ఏంబాగుంటుందన్నట్టు పనిగట్టుకు మరీ వాళ్లిద్దరి అనుబంధాన్ని ప్రచారం చేస్తున్నారు. తమాషా ఏమిటంటే తెలుగులో వెంకటేశ్‌తోనన్నా వేసిందిగానీ కత్రీనా ఇంతవరకూ తన బాయ్‌ఫ్రెండ్‌తో ఒక్క సినిమాలో కూడా చేయలేదు. ఇప్పుడా లోపం కూడా తీరిపోతోంది. దక్షిణాది సినిమాలను కచ్చకచ్చగా హిందీలో తీసిపారేసే డేవిడ్ ధావన్ తాజా సినిమాలో సల్మాన్ ఖాన్, కత్రీనా జంటగా కనువిందు చేయబోతున్నారు. అన్నట్టు తమ కొత్త సినిమాకోసం కత్రీనా హిందీ డిక్షన్‌కి సంబంధించి ట్యూషన్లకు వెళుతోంది. ఈ సినిమాలో తన డైలాగ్స్ అదురుతాయని ముందే ఆత్మవిశ్వాసంతో చెబుతోంది. మరి పక్కనుంది ఎవరు?

ఇద్దరినీ ఒకటి జేసినారు. అత్తగారింటికాన్నే రొండు నెల్లు అల్లెం తిన్నాడు.

మనిషి బాగా తిరుక్కున్నాడు. నునుపుదేలినాడు. మూడోనెల మంచిరోజు జూసుకోని అత్తగారింటినుంచి నారిగాడు పెళ్లాన్ని తీసుకోని ఇంటికొచ్చినాడు.

''నారాయణా! రొన్నెల్లయింది పనికిబోక. అప్పుడంటే ఒక్కనివే. ఇప్పుడు ఇద్దరయినారు. పనికిబోకపోతే ఇబ్బంది నాయనా'' అంటూ పట్టుబడితే మల్లా వెల్డింగు పనికి బోడం మొదలు పెట్టినాడు.

నెలరోజులు వెల్డింగు పనికి పోగానే అల్లెం తిన్నె పాణం సచ్చు తిరుక్కునింది. మంచంలో ఒక పట్టెమీద పెళ్ళాము.. ఇవతల పట్టెమీద నారిగాడు పడుకోవడం మొదలైంది.

ఒకరోజు అత్తకొనిచ్చిన మల్లెపూలు బెట్టుకోని మొగుడి కోసం ఎదురు చూసింది. రాత్రి సగెర పొద్దున ఇంటికొచ్చినాడు నారాయణ. ఓపిక జేసుకుని బువ్వబెట్టింది. అన్నం తిన్నేక పట్టెకరుసుకోని అట్నే నిద్దరపోదామని జూసినాడు.

పాపం మల్లెపూలు పెట్టుకున్న పెళ్లాం మాత్రం మీద చెయ్యేసింది. నారాయణకు మనసు మనసులో లేదు. ''ఏమే! తెల్లవార్జులూ ఎల్డింగు పన్జేసి వచ్చిన. కనికరమే లేదుగదునే నీకు'' అనగానే పెళ్లాంకు ఈనికత అర్థమైంది.

ఇంట్లో రోజూ ఏదో ఒకదానిమీద కొట్లాడ్తానే వుండాడు, పెండ్లాం అట్టయినా దూరంగా వుంటాదని.

పెండ్లాం కూడా రెటమతం మనిషి. మాటకు మాట మీర్తానే వుండాది. వెల్డింగు శివయ్య మాత్రం ఈళ్ల కొట్లాడలో తలదూర్చడంలే. సర్దిజెబుదామనుకుంటే నీ కొడుకు మగతనం లేనోడంటాదేమోనని శివయ్య భయం.

* * *

పెండ్లయి నాలుగు నెల్లు గడిచినాది. నారిగాడు వాని పెండ్లాము కడగా బొయినారు. వెల్డింగు పని మానుకుంటే ఎండగాలాల్సిందే. వెల్డింగు పనిజేసి పొద్దుబోయి ఇంటికొస్తే మంచానికి ఎడంపట్టె పట్టుకోని తిరిగిజూసేలకు నిద్దర్లోకి జారుకుంటాండాడు. దాంతో భార్యపోరు పెద్దదయ్యిండాది.

ఒకరోజు నారిగాడి పెండ్లాము ''నేను మాయమ్మగారింటి పోతా. ఇట్టయితే ఆడున్నే ఒకటే. ఈడున్నే ఒకటే. ఏమీలేనందుకు ఎందుకీడ?'' అంటూ నారిగాడు పనికిబోయే ముందు జెప్పింది.

ఏమీ జెప్పకుండా పనికాడికెల్లిపోయినాడు.

నారిగాడి స్నేయితులు బాయికాడ కిట్టిగాడు, సుధాకరుగాడు కూడా పెళ్లిల్లు జేసుకుని సముద్ర మట్టాల సంసారాన్ని ఈత్తాండారు. ఇద్దరూ చిక్కిపోయి కాల్లెనకమ్మడీ రాడంలే. వాళ్ళూ పెండ్లాల్తో ఎప్పుడూ గొడవే.

* * *

మగపిల్లోడు పుడితే ముడుపుకట్టుకోని నీదగ్గెర గుండుకొట్టిచ్చుకుంటా సామి అని ముక్కునేదానికి గండాంజనేయ సామి గుడికి బయలుదేరింది జెండామాను పీరయ్య భార్య వుశానమ్మ.

సామి పాదాల ముందర పారుతూన్న ఏట్లో నిండామునిగి టెంకాయ కొట్టి దేవుని దర్శనం జేసుకుందామని వచ్చి నాలుగు మెట్లెక్కింది.

అంతే! ఎదురుగా వెల్డింగు శివయ్య కొడుకు నారిగాడు చిన్న స్టూలు మింద టెంకాయలమ్ముకుంటాండాడు. అప్పుడు పాయిన పోడం ఇప్పుడిక్కాడా వాడు వూళ్లేకి రాలా. వుశానమ్మ నేరుగా వానిదగ్గరికి పోయింది.

వుశానమ్మను జూచ్చానే వానికి పాణం ఎగిరిపోయింది. ''వుశానమ్మా! నీ కాళ్లకు దండం పెడతా. నేనీడున్నెట్టు ఇంటికాడ జెప్పాకు. నీ పుణ్నెముంటాది. పెండ్లంటే నేనేమో అనుకున్నా. నాకు పెండ్లామూ వద్దు. పిల్లలూ వద్దు. వెల్డింగు పనీ వద్దు. గండాంజనేయ సామి దగ్గర టెంకాయలమ్ముకుని బతుకుతా'' అంటూ వుశానమ్మ కాళ్ళు పట్టుకున్నాడు.

వుశానమ్మ వెనిక్కి తిరిగి నాలుగడుగులు ఏసిందో లేదో సుధాకరూ, బాయికాడ కిట్టిగాడు కూడా నారిగాడికి మొరపెట్టుకుంటాండారు.. ''నీ పుణ్నెముంటదిరా మేమూ ఈన్నె టెంకాయలమ్ముకుంటాము'' అని.

అప్పుడనుకున్నాది వుశానమ్మ 'అయిందమ్మా పెండ్లి.. అనిగిందమ్మా రంది' అని. ★